సమాచారం

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 13, వంకాయ 21, బెండ 37, పచ్చిమిర్చి 40, కాకర 40, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్19. దొండ 23, ఆలు 20, ఉల్లి 12, గోకర 40, దోస 23, సొర 09, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 55, అర్వి 45, మునగ 23, చిలగడదుంప 41, బీట్‌రూట్ 19 కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 40.

నేడు రైతుబజార్‌కు సెలవు

సరూర్‌నగర్ రైతుబజార్‌కు నేడు సెలవు అని రైతుబజార్ ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతి నెలా 3వ బుధవారం సెలవు ఉన్నందున నేడు రైతు బజార్‌లో ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని ఆమె అన్నారు. గురువారం యథావిధిగా రైతుబజార్‌లో క్రయ, విక్రయాలు జరుగుతాయన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి



పోచమ్మ తల్లి ఆలయంలో మహిళలతో కమలా సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుని తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సతీమణి, జయచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కమలా సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె వనస్థలిపురం ఫేజ్–2 హుడా కాలనీ ఏ టైప్ క్వార్టర్స్‌లోని పోచమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో ఆమె సమావేశమయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, మహిళా అధ్యక్షురాలు గాండ్లలతా ఆనంద్‌రాజ్, కొలిశెట్టి మమత, పలువురు మహిళలు పాల్గొన్నారు.

జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

చైతన్యపురి: ప్రముఖ విద్యావేత్త, గ్రీన్ అంబాసిడర్ ఆఫ్ తెలంగాణ, లోటస్ ల్యాప్ విద్యాసంస్థల చైర్మన్, లయన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి అభ్యాస విజేత అవార్డుల ప్రదానంలో భాగంగా జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో శాంత బయోటెక్ చైర్మన్ పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా కొత్త విధానంలో విద్యాబోధన చేస్తున్నందుకు తనకు ఈ పురస్కారం దక్కిందని గోపాల్‌రెడ్డి తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు



నిందితుడు మహమ్మద్ ఆరీఫ్

రంగారెడ్డి కోర్టులు: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 11 వేల జరిమానా విధిస్తూ ఎల్బీనగర్ 9వ అదనపు జిల్లా కమ్ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కోర్టు స్పెషల్ పీపీ బర్ల సునీత తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు మహమ్మద్ ఆరీఫ్ (22) కూలర్ రిపేరింగ్ చేస్తుంటాడు. బాధితురాలి తల్లిదండ్రులు 2017 జూలై నెలలో తమ కూలర్ రిపేరింగ్ నిమిత్తం కూలర్ కంపెనీని సంప్రదించారు. ఆ కంపెనీ తరఫున కూలర్ బాగు చేసేందుకు వచ్చిన ఆరీఫ్ బాలిక ఫోన్ నంబర్ తీసుకొన్నాడు. తనను ప్రేమించాలని ఫోన్లు, మెసేజీలు చేస్తూ వేధించేవాడు. ఇదే క్రమంలో ఎవరూ లేని సమయంలో ఆమె ఇంట్లోకి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో అక్కడ నుంచి పరారయ్యాడు. తర్వాత నీ తండ్రిని చంపుతానని బాలికను బెదిరించాడు. బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు చైతన్యపురి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు నిందితుడికి ఐదేళ్ల జైలు, 11 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చింది.

‘ఫైర్’ అలర్ట్!

- ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో కొనసాగుతున్న ఫైర్‌సేఫ్టీ సర్వే
- మూడు కేటగిరీల్లో చేస్తున్న అధికారులు
- ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు
- ఎక్కువ ప్రమాదాలు జరిగేది రెడ్ కేటగిరీలోనే..

ఎల్‌బీనగర్: వరుస అగ్ని ప్రమాదాలు గ్రేటర్‌వాసులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోవడంతో నగరవాసులతో పాటు అధికారులకు కంటిమీద కునుకు పడటంలేదు. వరుస ఘటనల నేపథ్యంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్ల అధికారులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా షాపింగ్ మాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సంస్థల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఏ విధంగా అమలు చేస్తున్నారనే దానిపై ముమ్మరంగా సర్వే చేస్తున్నారు.

మూడు విభాగాలుగా సర్వే...

భవనం సెల్లార్లపై సర్వే, మెట్ల వద్ద ఆక్రమణలపై సర్వే, మూడోవది అగ్గి రాజుకుంటే త్వరగా బుగ్గి అయ్యేవి రెడ్ కేటగిరీ షాపులపై సర్వేలు చేస్తున్నారు. ఇందులో భాగంగా షాపింగ్‌మాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కిరాణాషాపులు, హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితరాలపై అధికారులు కన్నేసి ఉంచారు.

సెల్లార్లపై సర్వే...

ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్ల పరిధిలో ఇప్పటి వరకు సుమారు 242 సెల్లార్లలో ఫైర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్నారని గుర్తించారు. వీరందరికీ ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని, లేని పక్షంలో వ్యాపారాలను నడపకుండా సీజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారని తెలిసింది.

సర్కిళ్ల వారీగా వివరాలు..

కాప్రా సర్కిల్‌లో 51, ఉప్పల్ సర్కిల్‌లో 30, హయత్‌నగర్ సర్కిల్‌లో 56, ఎల్‌బీనగర్ సర్కిల్‌లో 27, సరూర్‌నగర్ సర్కిల్‌లో 78 ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఇక్కడ అగ్నిప్రమాదాలు జరుగకుండా వెంటనే ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్టేర్‌కేస్‌పై ఎటువంటి వస్తువులు పెట్టరాదు...

షాపింగ్‌మాల్ లేదా ఇతర వ్యాపార వాణిజ్య సంస్థలకు వెళ్లే వారు సులభంగా లోనికి, బయటకు వెళ్లేందుకు వీలుగా మెట్లు ఆక్రమణకు గురికాకుండా చూడాలని వ్యాపారులకు అధికారులు సూచిస్తున్నారు.

◆ ఇలా చేస్తే ఏదైనా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ప్రజలు బయటకు వెళ్లేందుకు వీలవుతుందని చెబుతున్న అధికారులు.. వ్యాపారులు ముందస్తు జాగ్రత్తలు పాటించేలా సూచనలు ఇస్తున్నారు. మెట్ల ఆక్రమణకు పాల్పడిన వారి వివరాలను జీహెచ్‌ఎం సిబ్బంది గుర్తిస్తున్నారు.

ఆ వివరాలు...

◆ కాప్రా సర్కిల్‌లో 48, ఉప్పల్ సర్కిల్‌లో 30, హయత్‌నగర్ సర్కిల్‌లో 36, ఎల్‌బీనగర్ సర్కిల్‌లో 17, సరూర్‌నగర్ సర్కిల్‌లో 49 మంది వ్యాపారాలు మెట్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని ఫైర్ సేఫ్టీ సర్వేలో అధికారులు గుర్తించారు. వీరిందరినీ అప్రమత్తం చేసి ఇక నుంచి మెట్లపై ఎలాంటి వస్తువులు పెట్టకుండా, వినియోగదారులు సులువుగా షాపింగ్ చేసేలా చేసే ఆక్రమణలు లేకుండా చూడాలని సూచించారు.

మూడోది రెడ్ కేటగిరీ..

మూడో ఫైర్ సేఫ్టీ.. త్వరగా మంటలంటుకొని భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఈ కేటగిరీ వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే తరచూ అగ్ని ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

టింబర్ డిపోలు, పెయింటింగ్ షాపులు..

◆ పెయింటింగ్ షాపులు, స్క్రాప్ దుకాణాలు, గోడౌన్లు త్వరగా మంటలు వ్యాపించే వస్తువులు ఉండే రెడ్ కేటగిరీలోకి వచ్చాయి. వీటిపై సర్వే చేసి జనావాసాల మధ్య ఉంటే వాటిని వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటి వరకు ఆయా సర్కిళ్లలో గుర్తించిన వాటి విరాలు ఇలా ఉన్నాయి...

◆ కాప్రాలో 7, ఉప్పల్‌లో 9, హయత్‌నగర్‌లో 23, ఎల్‌బీనగర్‌లో 4, సరూర్‌నగర్‌లో 25 ఉన్నట్లు ఇప్పటి వరకు సర్వేల ద్వారా తేల్చారు. వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని సర్వే పూర్తి అయితే గాని లెక్కలు తేలవని అధికారులు అంటున్నారు. ఈ నెలాఖరుకు కచ్చితమైన సమాచారం రావచ్చని తెలుస్తోంది.



ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం

నిబంధనలు పాటించాలి

ఇటీవల వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణ నష్టం జరగడం ఆందోళనకు గురి చేస్తోంది. వ్యాపార సంస్థలు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడం, ఎమర్జెన్సీ ఎగ్జిట్ పక్కాగా లేకపోవడం వల్ల కూడా ప్రాణ నష్టం జరుగుతోంది. రెడ్ కేటగిరీలో ఉన్న పెయింటింగ్, టింబర్ డిపోలు, స్క్రాప్ దుకాణాలు ఇళ్ల మధ్య కాకుండా నగరానికి దూరంగా ఏర్పాటు చేసుకుంటే మంచిది.

పంకజ, జోనల్ కమిషనర్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అక్బర్‌బాగ్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు

మలక్‌పేట: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం మలక్‌పేట ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో నివాస ప్రాంతాలతో పాటు పెట్రోల్ పంపులు, హాస్పిటల్స్, హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మహ్మద్ ముస్తాఫా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాద నివారణ పద్ధతులను పాటించాలన్నారు. విద్యుత్ ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఆర్పేందుకు నీటి వాడకూడదని, పొడి ఇసుకను మాత్రమే వాడాలన్నారు. అతుకులు వేసి విద్యుత్ తీగలను, లూజ్ వైరింగ్ ఉపయోగించకూడదన్నారు. ల్యాప్‌టాప్, సెల్ ఫోన్‌చార్జింగ్ బెడ్ దగ్గర పెట్టరాదని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు అరికట్టడానికి, జాతి సంపదను పెంపొందించడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆఫీసర్స్ కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్, ఎంటమాలజీ, హార్టికల్చర్ అధికారులు, కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను కాలనీవాసులు అధికారులకు వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, చిన్నపాటి వర్షాలు కురిసినా కాలనీ రహదారులు వరదనీటితో నిండి స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయక పోవడంతో అవి నిండి పొంగి పొర్లుతున్నాయన్నారు. కాలనీలో నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, కాలనీ సమస్యలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆమె కోరారు. సమావేశంలో డీసీ నర్సింహ, డీపీఓ రత్నమ్మ, ఏఈ అన్సారీ బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

చైతన్యపురి: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా అన్నారు. డివిజన్‌లోని గణేష్‌పురి కాలనీ, మున్సిపల్ కాలనీల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించి కాలనీల్లోని రోడ్లను పరిశీలించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీరు, రహదారుల సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈలు రవీందర్ రెడ్డి, పార్వతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, కాలనీవాసులు అనిల్, కృష్ణగౌడ్, యాదయ్య, జైహింద్, రాజిరెడ్డి, రమేష్‌యాదవ్, పసుపుల హరిబాబు, రామ్మోహన్, ఉదయ్, అర్జున్, భాను తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచి పారిశుద్ధ్య కార్మికులు రోడ్డెక్కి వీధులన్నీ శుభ్రం చేస్తున్నారని, వారి వల్లే నగరం పరిశుభ్రంగా ఉంటోందని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆదేశాల మేరకు మన్సూరాబాద్ డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పారంద సాయి ఆధ్వర్యంలో డివిజన్ పరిధి బొమ్మలగుడి వద్ద పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ హాజరై శానిటేషన్ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీధుల్లోని చెత్తను నిత్యం ఎత్తివేస్తూ కాలనీలోని రోడ్లను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న కార్మికుల సేవలు వెలకట్టలేమని అన్నారు. వారిని గౌరవంగా చూసుకుందామని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాణాల ప్రవీణ్‌కుమార్, గుండె కిరణ్‌కుమార్, నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, కడారి యాదగిరియాదవ్, సాయిరాంగౌడ్, శానిటేషన్ సిబ్బంది నరేష్, వెంకటేష్, భిక్షపతి, అండాలు, కళమ్మ, యాదమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

చైతన్యపురి: హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా హమాలీల సంఘం అధ్యక్షుడు పల్లెపాక వీరయ్య డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో హమాలీల ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే హమాలీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పని గంటలు, పని భద్రత ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, కనీస వేతనాల ఇవ్వాలని, సెక్షన్ 20 ప్రకారం చట్టబద్ధ హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డి. శ్రీనివాస్, దూలప్ప, బిచ్చమ్మ, రాజు, లింగయ్య, శ్రీను, సాయిలు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ప్రశాంత్‌నగర్ సమస్యలు పరిష్కరించండి



కార్పొరేటర్‌కు సమస్యలు తెలియజేస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: డివిజన్ పరిధిలోని ఈస్ట్‌ప్రశాంత్‌నగర్ మంగళవారం మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కాలనీవాసులు కోరారు. చెట్ల కొమ్మలు పెరిగి స్ట్రీట్ లైట్లు కన్పించడం లేదని, కొత్త రోడ్లపై వ్యర్థాలు, మట్టికుప్పలు తొలగించలేదని కాలనీవాసులు అధికారులకు తెలిపారు. పాడైన రోడ్లు నిర్మించాలని, చెట్లకొమ్మలు తొలగించాలని, నిత్యం పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ, వీలైనంత మేరకు సమస్యలకు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బన్సీలాల్‌కుమార్, జలమండలి ఏఈ చంద్రునాయక్, ఎస్సై శృతిరెడ్డి, ఎంటామాలజీ సూపర్‌వైజర్ గుండప్ప, స్ట్రీట్‌లైట్స్ దుర్గారావు, కాలనీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సెక్రటరీ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి



న్యూ ఆర్‌బీఐ కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని ఒక గజం ప్రభుత్వ స్థలం కూడా కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ ఆర్‌బీఐ కాలనీలో ప్రభుత్వ స్థలం కబ్జాలకు గురవుతున్నదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి న్యూ ఆర్‌బీఐ కాలనీకి వెళ్లి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే పార్కు వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సంబంధిత అధికారులను సంప్రదించిన కార్పొరేటర్.. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరారు. డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి చుట్టూ కంచె వేయడంతో పాటు ఆ స్థలాల్లో పార్కులు, ఓపెన్ జిమ్‌లు, లైబ్రరీ వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హస్తినాపురం: ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆమె హాజరయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న షాదీముబారక్, ఇతర సంక్షేమ పథకాలను అర్హులైన ముస్లింలందరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు జాకీర్ జావేద్ , చాంద్‌పాషా, బీఆర్‌ఎస్ నాయకులు ఆదిలక్ష్మి, విజయ్, రోహిత్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, గోపీసింగ్, రాంచందర్‌నాయక్, బుజ్జినాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు



యోగాసనాలు వేస్తున్న జ్యోతిర్మయి

నాగోలు: నేటి యాంత్రిక జీవనంలో ఆరోగ్య పరిరక్షణకు యోగాసనాలు మేలు చేస్తాయని మహిళా పతంజలి యోగా సమితి తెలంగాణ సౌత్ ఈస్ట్ అధ్యక్షురాలు కె.జ్యోతిర్మయి అన్నారు. నాగోలు డివిజన్ రాక్ టౌన్ కాలనీలోని గొట్టేటి కల్యాణ మండపం భవనంలో వారం రోజులు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ యోగా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఒక గంట సమయాన్ని యోగాకు కేటాయిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.

యుద్ధప్రాతిపదికన డ్రైనేజీలను ఆధునీకరించండి

జలమండలి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



వివేకానందనగర్‌లోని డ్రైనేజీ సమస్యపై జలమండలి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే డ్రైనేజీల ఆధునీకరణకు చర్యలు చేపడుతున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ వివేకానందనగర్ కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి తమ కాలనీలోని డ్రైనేజీ సమస్య తీవ్రతను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జలమండలి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు కూలిపోవడంతో లీకేజీలు ఏర్పడి నీరు కలుషితమవుతోందన్నారు. యుద్ధప్రాతిపదికన డ్రైనేజీలను ఆధునీకరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. డ్రైనేజీ పైపులు భూగర్భంలో 18 ఫీట్ల లోతులో ఉన్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తిచేసి కాలనీవాసులకు డ్రైనేజీ సమస్య నుంచి విముక్తి కల్పించాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ కుమార్, మేనేజర్ ప్రేమ్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీరామ్‌రెడ్డి, రామ్మిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీడీఎల్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తాం



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లోని బీడీఎల్ కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కాలనీలో పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోతున్నదని, ప్రధాన రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో మ్యాన్‌హోళ్ల మూతలు పగిలిపోతున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. వీధి దీపాలు లేక రాత్రిపూట కాలనీలో తిరగలేక పోతున్నామన్నారు. ఆయా సమస్యలను అధికారులతో చర్చించి వీలైనంత తొందరగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ కరేంద్రతేజ, జలమండలి అధికారి, వాహిని, స్ట్రీట్ లైట్స్ ప్రతినిధి లక్ష్మణ్, కాలనీ నాయకులు మాధవరెడ్డి, సుధీర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

- బస్తీ రోడ్లపై పొంగుతున్న మురుగు
- విజృంభిస్తున్న దోమలు
- అనారోగ్యం బారిన జనం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ పరిధిలోని ప్రధాన రోడ్లు, ఎన్‌టీఆర్‌నగర్ బస్తీలో సమస్యలు తాండవిస్తున్నాయి. బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసించే ఈ కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. పుట్టెడు కష్టాలతో కునారిల్లుతున్న అంబేడ్కర్‌నగర్ కాలనీవాసుల బాగోగులు పట్టించుకునే వారు కరువయ్యారు.

◆ ఎన్‌టీఆర్ నగర్ బస్తీలోని అంతర్గత రహదారులు అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నాయి. అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ మరీ అధ్వానంగా ఉంది. ప్రస్తుత అవసరాలకు సరిపోక పొంగిపొర్లుతోంది. ముక్కుపుటాలు అదిరిపోయే విధంగా దుర్గంధంతో గడుపుతున్నారు.

◆ డ్రైనేజీలో నుంచి తీసిన మురుగును ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో రోడ్లపైనే కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. ఫలితంగా దోమలు వృద్ధి చెంది కాలనీలపై దండయాత్ర చేస్తున్నాయి. రాత్రి వేళల్లో దోమలు విజృంభిస్తుండటంతో కంటి మీద కునుకు ఉండటం లేదని, డెంగీ వంటి రోగాల బారిన పడుతున్నామని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఎన్‌టీఆర్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త



రంగారెడ్డిజిల్లా కోర్టు సమీపంలోని ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త